
ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు
బాల్య వివాహ రహిత జిల్లా గా నెల్లూరు జిల్లాను తీర్చిదిద్ది భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి. హేనా సుజన్ పిలుపు నిచ్చారు. భారత ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ వంద రోజుల అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల/జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశం గురువారం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రాంగణం నందు బాల్య వివాహ రహిత భారత్ కోసము100 రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అధికారులు, సిడిపిఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

"దిత్వా" తుఫాన్ నెల్లూరు జిల్లాను వర్షాలతో అతలా కుతలం చేస్తోంది.. మూడు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తోన్న వర్షాలతోపాటు, గురువారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తితంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి... సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తిగా నిండిపోయాయి.. జిల్లాలోని అనేక చెరువులు, పిల్ల కాలువలు నీటితో ప్రవహిస్తున్నాయి.. నెల్లూరు నగరం మొత్తం నీటితో నిండిపోయింది. నగరంలోని మూడు అండర్ బ్రిడ్జిల వద్దకు నీటితో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.. నగరంలోని పలు కాలనీల్లోని నీరు చేరింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా కండలేరు జలాశయం సందర్శించారు. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగనుండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి..

'దిత్వా' బీభత్సం..!

- -జిల్లా వ్యాప్తితంగా భారీ వర్షాలు
- -వాగులు, వంకలు ఉధృతం
- -హైవేపై రాకపోకలు బంద్
- -నెల్లూరులో ఎటూ చూసిన నీరే
- -కండలేరును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
దిత్వా తుఫాన్‌తో భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలమవుతోంది. ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తితంగా వర్షం కురుస్తూనే ఉంది. నెల్లూరు నగరంలోని రామలింగాపురం, మాగుంట లేఔట్, విజయమహల్ గేట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ పాస్ బ్రిడ్జిలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. రాకపోకలు నిలిచిపోయాయి. అమ్బేడ్కర్ స్కూల్ వద్ద రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. వెంకటాచలం, బుజబుజ నెల్లూరు వద్ద చెరువు నిండి జాతీయ రహదారిపైకి నీరు వచ్చింది. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయి, ఒక మార్గంలోనే వాహనాలు పంపారు. కొత్తూరు వైఎస్ఆర్ కాలనీ తల్పగిరి కాలనీ, మన్సూర్ నగర్, అయ్యప్పగుడి, తదితర ప్రాంతాలతోపాటు అనేక ప్రాంతాల్లోని కాలనీలోకి నీరు చేరింది. సిపిఎం, టిడిపి నాయకులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల బాగోగులు చూశారు. టిడిపి నేత గిరిధర్‌రెడ్డి నగరంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి అడ్డంగ ఉన్న ఇళ్లను జెసిబిలతో తొలగించారు. కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. పొట్టేపాళెం కలుజు భారీగా నీరు వస్తుంది. పెన్నా నదికీ వరద ప్రవాహం పెరిగింది. మద్రాసు బస్టాండ్, గాంధీబొమ్మ, సండే మార్కెట్, కలెక్టరేట్, సంతపేట, విజయమహల్ గేట్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు, డైనేజ్‌తో చేరి రోడ్లపైకి వచ్చాయి. తుఫాన్ కారణంగా సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు, వెంకటాచలం, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులకు సూచనలు చేశారు. యువనాయకులు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కండలేరు ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా వర్షం, వరదలు కారణంగా ప్రజలకు ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


నెల్లూరులో రోడ్డుపై భారీగా వరద నీటి ప్రవాహం

కండలేరు వద్ద కలెక్టర్ హిమాన్షు శుక్ల
కండలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల కండలేరు జలాశయ అధికారులను ఆదేశించారు. దిత్వా తుఫాను నేపథ్యంలో భారీగా కురుస్తున్న వర్షాలకు కండలేరు జలాశయానికి ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో గురువారం కండలేరు జలాశయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్ల పరిశీలించారు. డ్యాం కెపాసిటీ, క్రస్ట్ గేట్లు, మోటారు పనితీరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 60 టిఎంసిల నీరు ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని ఎస్ ఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు కలెక్టర్ కు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నీటిని విడుదల చేయాలని కలెక్టర్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కండలేరు సమీప గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సహాయక చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్‌డిఒ అనూషను సూచించారు. ప్రధానంగా పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లోని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బోట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్ఇ సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఆర్‌డిఒ అనూష, పలువురు ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.




రామలింగాపురం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

పొంగిన వాగులు
ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరులో భారీ వర్షం కురవడంతో గుడ్లూరు సమీపంలో ఉన్న ఉప్పుటేరు, ఎలికేరు పొంగి ప్రవహిస్తున్నాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొంగుతున్నాయి. చెరువులు నిండిపోయవాయి. గురువారం ఏకువ జాము నుంచి ఉదయం 11 గంటల వరకు ఎడతెరపిలేని వర్షం కురిసింది.

సైదాపురం: మండలంలో గత మూడు రోజులుగా దిత్వా తుఫాన్ కారణంగ భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి మండలంలోని ఊటుకూరు వద్ద మాలేరు వాగు, తురిమెర్ల వద్ద పిన్నేరు వాగు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సైదాపురం, పొదలకూరు మార్గంలో అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్
నెల్లూరులో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రభావిత ప్రాంతాలలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలను పర్యవేక్షిస్తూ కమిషనర్ వై.ఓ నందన్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విస్తతంగా పర్యటిం చారు. నేషనల్ హైవే సమీపంలోని చంద్రబాబు నగర్ కు వెళ్లే మార్గంలో మేజర్ డ్రైన్ కాలువలో వరద నీటి ప్రవాహాన్ని కమిషనర్ పరిశీలించారు.
30 వ డివిజన్ ముంపు ప్రభావానికి గురైన లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రంలో బాధితులకు అందిస్తున్న సదుపాయాలను కమిషనర్ నందన్ పరిశీలించారు. వరద ప్రభావం తగ్గే వరకు కేంద్రంలో అన్ని వసతులను పర్యవేక్షిం చాలని అధికారులను ఆదేశించారు.నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ గురువారం రామలింగాపురం అండర్ బ్రిడ్జిని పరిశీలించారు.

గంజాయి బ్యాచ్‌ని వదలం : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు :
ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్య గంజాయి బ్యాచ్ పనేనని, ఎవరినీ వదలిపెట్టమని ఎస్‌పి అజితా వేజండ్ల తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. పెంచలయ్య హత్యకేసులో సూత్రధారి అరవ కామాక్షి తల్లిదండ్రులు జబల్‌పూర్ నుంచి 35 సంవత్సరాల క్రితం నగరంలోని బోడిగాడి తోటకు వచ్చి జీవనం సాగిస్తుండేవారన్నారు. అరవ కామాక్షి తల్లి శాంతి గంజాయి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేదని, ఈ వ్యాపారం చేయడం శాంతి కుటుంబ సభ్యులు అలవాటు చేసుకున్నారన్నారు. గంజాయి అక్రమ వ్యాపారాన్ని ఆర్‌డిటి కాలనీ వాసులు వ్యతిరేకించారన్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి నిధులు సేకరించి 70శాతం ఆలయ నిర్మాణం పూర్తి చేసిందన్నారు. మూడు నెలల క్రితం ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య ఆధ్వర్యంలో కొంత మంది యువత ఒక కమిటీగా ఏర్పడి తమ నివాస ప్రాంతాల్లో గంజాయి విక్రయించారని, అక్రమ వ్యాపారం చేసే వారికి కాలనీలో ప్రవేశం లేదని తీర్మానం చేశారన్నారు. ఈ సమయంలో అరవ కామాక్షి వ్యాపారానికి వ్యతిరేకంగా పెంచలయ్య పోలీసుల సహాయంతో గంజాయి వల్ల కలిగే అనర్ధాలు వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహించడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అరవ కామాక్షి అవమానంగా భావించిందన్నారు. ఈ సమయంలో పాలకీర్తి రవి సహాయంతో కమిటీ సభ్యులతో ఘర్షణకు దిగిందన్నారు.. కొన్ని సంవత్సరాల నుంచి ఈ కాలనీలో తాను ఆధిపత్యం కొనసాగిస్తుంటే దానికి భంగం కలిగే విధంగా పెంచలయ్య అడ్డు తగులుతున్నాడని, అడ్డుతొలగించు కోవాలని ఈ హత్యకు అరవ కామాక్షి 18 మందితో కలిసి వ్యూహరచన చేసి ఈ ఘాతుకానికి పాల్పడిందన్నారు. ఇప్పటికే ఈ ఘటనలో నిందితులుగా పేర్కొంటూ 15 మందిని అదుపులోకి తీసుకున్నామని, మరో ముగ్గురు కోసం పోలీసులు గాలిస్తున్నారని, అతి త్వరలో వారిని అరెస్టు చేస్తామన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడుతున్నట్లు తెలిస్తే 112, ఈగల్ విభాగం టోల్‌ఫ్రీ నెంబరు 1972కి సమాచారం అందజే యాలన్నారు. అడిషినల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య, రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన పెంచలయ్య కుటుంబం

న్యాయం చేస్తామని హామీ

గంజాయి మాఫియా, అరాచక శక్తులు చేతిలో హత్యకావించబడిన కె.పెంచలయ్య కుటుంబ సభ్యులను ఎస్‌పి అజిత వేజెండ్ల పరామర్శించారు. గురువారం నెల్లూరు నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో పెంచలయ్య భార్య దుర్గా, కుమారులు దేవ్, నిఖిల్ ఆమెను కలిశారు. ఎస్‌పి మాట్లాడుతూ కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోవడం ఎంతో భాదకరమని, మానసిక వేదన తాను అర్థం చేసుకోగలని, త్వరితగతిన చట్టపరమైన సహాయం అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైతే పోలీసు రక్షణ కల్పిస్తామని, బాధిత కుటుంబానికి పోలీసు శాఖ పరమైన న్యాయం అందజేస్తామని భరోసా కల్పించారు. పెంచలయ్య హత్య ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని, ఇప్పటికే ఈ ఘటనలో ప్రధాన ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. మిగిలిన వారి పాత్ర గురించి లోతుగా విచారణ చేస్తున్నామన్నారు. పెంచలయ్య ఆశయాలను,స్ఫూర్తిని కొనసాగించేందుకు జిల్లా పోలీసు వ్యవస్థ సహకరిస్తుందన్నారు.అనంతరం 'గంజాయి వ్యతిరేక అవగాహన పోస్టర్ల'ను పెంచలయ్య కుటుంబ సభ్యులచేతుల మీదుగా ఆవిష్కరించారు. పెంచలయ్య సతీమణి దుర్గా మాట్లాడుతూ తన భర్తను దారుణంగా హత్య చేసిన వారికి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అజిత వేజెండ్ల ముందు కన్నీటి పర్యంతమైంది.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

డిడిఒ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వం పంచాయతీరాజ్ పాలన మరింత సులభతరం చేసేందు అవసరమైన రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాలు ప్రారంభించడం సుభపరిణామని ఎంఎల్‌సి బీద రవిచంద్ర అన్నారు. గురువారం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలోని నెల్లూరు డివిజనల్ డెవలప్మెంటు అధికారి కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ యం.యల్.సి. బీదా రవిచంద్ర , జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వ హణాధికారి, యల్. శ్రీధర్ రెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, మోహన్ రావు , జిల్లా పంచాయతీ అధికారి డి. వసుమతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కవర్లు పంపిణీ

ప్రజాశక్తి - గుడ్లూరు :గుడ్లూరులో గత ఐదు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ కార్మికులకు మండల జనసేన అధ్యక్షులు సనిశెట్టి గిరిబాబు వాన కవర్లు గురువారం పంపిణీ చేశారు. కందు కూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పులి రమేష్ ఆదేశాల మేరకు సుమారు 60 మందికి రెయిన్ కవర్లు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

రాపూరులో ర్యాలీ

రాపూరు :మండలంలోని ప్రజలందరూ కలిసి రాపూర్ లో సిద్ధలయ్య దేవాలయం సెంటర్ నుంచి తహశీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీలో రాపూరు పట్టణ ప్రజలు, ప్రజాసంఘాలు పార్టీల కతీతంగా ప్రజా ప్రతినిధులు దుకాణాదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి పాల్గొన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో కలపడం సరికాదన్నాకరు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్ని ఆ మండలాలను యథావిధిగా నెల్లూరు జిల్లాలోనే ఉండేలా చూడాలని కోరారు

డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు
గాయత్రి డిగ్రీ కళాశాలలో ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో స్కూల్,కాలేజీ బస్సుల డ్రైవర్‌లకు రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఆర్‌టిఒ టీవీ నాగలక్ష్మి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో డ్రైవర్లకి వినూత్నంగా కథ, పాటల రూపంలో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అర్థమయ్యేలా వివరించారు. ఎంవీఐ జె అనిల్ కుమార్ డ్రైవర్‌లందరూ ఆ డ్రైవ్ చేయడానికి ముందు ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



ఆలయం నిర్మాణంలో ఎంఎల్‌ఎ కృషి

ప్రజాశక్తి-కందుకూరు అంకమ్మ తల్లి దేవాలయ రూముల నిర్మాణంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు కషి మరువలేనిదని ఆలయ పునర్నిర్మాణ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు వెంకట మురళీమోహన్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వగహంలో ఎమ్మెల్యేని కలిసి ఘనంగా సత్కరించారు. అంకమ్మ తల్లి దేవాలయ కార్య నిర్వహణ అధికారి కార్తీక్ తదితరులు ఉన్నారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి -నెల్లూరు నెల్లూరు పొట్టే పాలెం కలుజువద్ద ప్రమాదవశాత్తు మృతి చెందిన మెహ్రాజ్ (17) అను యువకుడు మృతి చెందాడు. కాలుజు దాటుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో నీటి ప్రవాహం లో జారి పడిపోవడంతో స్థానికులు హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు యువకుడు మతి చెందినట్లు ధవీకరించారు. మృతి చెందిన యువకుడు నగరంలోని పొర్లు కట్ట నివాసిగా గుర్తించారు.

ప్రజల శ్రమదానానికి

అధికారపార్టీ నేతల అడ్డు..!

"ప్రజల బాగస్వామ్యంతో గ్రామాలు అభివృద్ధి చెందాలి...రోడ్లు, పాఠశాలలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరూ విరాళాలు ఇచ్చి సహకరించండి" అంటూ స్వయంగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిస్తున్నారు.. .కోవూరు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి తన సొంత డబ్బులతో విపిఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో నియోకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది... తమ ఊరి రోడ్డు కోసం ప్రజలు స్వచ్ఛంధంగా రూ.2 లక్షలు విరాళం సేకరించి, శ్రమదానంతో సిమెంట్ రోడ్డు వేసుకోడానికి ప్రయత్నం చేస్తే...అధికార టిడిపి నేతలు ఆపనులు చేస్తే, కాంట్రాక్ట్ పనులు ద్వార వచ్చే నగదు జేబులు నింపుకోడానికి వీలుకాదని గ్రహించి నానా హంగామా చేశారు... ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.. ఈ సంఘటన కోవూరు నియోజకవర్గం దామరమడుగులో గురువారం జరిగింది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి..

- -దామరమడుగులో ఉద్రిక్తత
- -స్వచ్ఛంధంగా రూ.2 లక్షల విరాళం
- -పర్సెంటేజీల కోసం పనులకు బ్రేక్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
కోవూరు నియోజకవర్గంలో ఆదర్శ పంచాయతీ దామరమడుగు గ్రామం...సింహపురి కమ్యూనిస్టు ఉద్యమ నేత జక్కా వెంకయ్య స్వగ్రామం.. 60 సంవత్సరాల నుంచి ఇక్కడ సిపిఎం సర్పంచ్ ఉన్నారు... ఇక్కడ అభివృద్ధికి గ్రామ ప్రజలు, సిపిఎం ఎంతో కృషి చేస్తున్నారు. ఈ దామరమడుగు గ్రామం నడిబొడ్డున పాఠశాల, బ్యాంక్, ఆసుపత్రి, సచివాలయం., ఉండగా ప్రతి నిత్యమూ వెయ్యి మంది ఇక్కడ తిరుగుతుంటారు. సుమారు 600 మంది విద్యార్థులు నిత్యం రాకపోకలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ఏనిమిది నెలల క్రితం గ్రామ పంచాయతీలో ఇక్కడ ఉన్న సిమెంట్ రోడ్డుకు అప్రోచ్‌గా 90 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేశారు. అందుకోసం రూ.3 నుంచి రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని పిఆర్ అధికారులు రిపోర్టు తయారుచేశారు. ఇక్కడ అభివృద్ధికి స్థానిక టిడిపి నాయకులు అడ్డుపడ్డారు. ఈ రోడ్డు నిర్మాణం చేయడానికి అవకాశం లేదంటూ పెండింగ్ పెట్టారు. ఆ స్థలం పిఆర్‌కు చెందినది కాదని, ఆర్అండ్‌బి ది అంటూ వివాదం సృష్టించారు. గ్రామస్తులు అప్పటి కలెక్టర్ ఓ. ఆనంద్‌కు మూడు సార్లు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పనులు చేపట్టాలని అదికారులను ఆదేశించినా ఏదొక సాకు చూపించి నిలిపేశారు. పిఆర్, ఆర్అండ్‌బి స్థలం అంటూ వివాదం సృష్టించడంతో మూడు నెలలు పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ నిధులు వచ్చే రోడ్డు పనులు పూర్తి చేసే అవకాశం లేకపోవడందో గ్రామస్తులు తామే విరాళాలు, శ్రమదానంతో రోడ్డు నిర్మాణం చేసుకోడానికి సిద్ధమయ్యారు.

శ్రమదానానికి అడ్డు..ఉద్రిక్తత..!
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పి4 పథకం, గ్రామాభివృద్ధి చేసుకోవాలని ఆశయంతో గ్రామస్తులు, విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సుమారు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. సిపిఎం నాయకులు,ప్రజలు 50 మంది స్వచ్ఛంధ శ్రమదానంతో రోడ్డు నిర్మాణం కోసం గురువారం ప్రయత్నాలు చేశారు. రెండు టిప్పర్లు మిక్చర్ తెప్పించుకున్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే సిపిఎంకు మంచిపేరు వస్తుందని, ప్రభుత్వం కాంట్రాక్టు పనులు చేస్తే పది రూపాయలు ఆదాయం వస్తుందని ఆశపడ్డ అధికార టిడిపి నేతలు పనులకు అడ్డుపడ్డారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. జెసిబి యజమానులను బెదిరించి అక్కడ నుంచి తరిమేశారు.. అధికారులు నేతలు వంతపాడారు. ప్రజల విరాళం, శ్రమదానంతో సిమెంట్ రోడ్లు నిర్మాణం జరుగుతుంటే ఏం నష్టం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి అక్కడ నెలకొంది. అధికారపార్టీ నేతల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పోలీసు అధికారులు, కొందరు అధికారులు వచ్చి పనులు నిలిపేశారు. దాతల నుంచి విరాళం ద్వార సేకరించిన దానిలో రూ.60 వేలు రెండు మిక్కర్ టిప్పర్లకు చెల్లించారు. పనులు జరగకపోవడంతో తెచ్చిన మిక్చర్ దారిలో పడేసి వెళ్లిపోయారు. ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గంలో తన సొంత ఖర్చులతో విపిఆర్ పౌండేషన్ ద్వార అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననను పొందుతున్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు విరాళంతో శ్రమదానంతో రోడ్డు నిర్మాణం చేపడితే అడ్డుపడడం వెనుక మతలబ్ తెలియక స్థానిక ప్రజలు అవాక్కవుతున్నారు. రాజకీయాల కోసమా...? కాంట్రాక్టు పనుల్లో పర్సెంటేజ్ కోసమా టిడిపి నేతలు తాపత్రయం తెలియడం లేదు. ముఖ్య మంత్రి చంద్రబా బునాయుడు, ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి ఆశయాలకు తూట్లు పొడితే నేతలకు చెక్‌పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజల విరాళంతో, శ్రమదానంతో గ్రామాభివృద్ధికోసం జరుగుతోన్న మంచి పనులను ముందుకు తీసుకెళ్లాలని దామరమడుగు గ్రామ ప్రజలు కోరుతున్నారు.


పాఠశాల వద్ద శ్రమదానంతో రోడ్డు వేయడానికి సిద్ధమైన సిపిఎం నాయకులు, ప్రజలు


పనులకు అడ్డుకుంటున్న టిడిపి నేతలు, పోలీసులు

ఊపిరితిత్తుల కేన్సర్ నివారణకు

ఆధునిక శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు :లంగ్ కేన్సర్; సంబంధిత వ్యాధులగ్రస్తులకు అడ్వాన్స్‌డ్ మినిమల్ ఇన్వాసిస్ థొరాసిక్ సర్జరీ అనే సరికొత్తంగా నూతన సాంకేతిక పద్దతిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు మెడికవర్ వైద్యులు డాక్టరు కె.వరుణ్ ప్రకాష్ ఫెలోషిప్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన మెడికవర్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ శస్త్ర చికత్సలకు సంబంధించిన వివరాలు మీడియాకు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంగ్ క్యాన్సర్ ,సంబంధిత వ్యాధుల కోసం రూపొందించిన ఈ అడ్వాన్స్‌డ్ మినిమల్ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీలో ఛాతీలో 10-15 సెం.మీ. పెద్ద కోత అవసరమైన పద్ధతులకు బదులుగా కేవలం 3-4 సెం.మీ. చిన్న కోతతో సర్జరీ చేయవచ్చన్నారు. ఈ నూతన విధానం వల్ల సమస్య తక్కువగా ఉంటుందని, రోగి ఆరోగ్యానికి గణనీయమైన లాభం కలుగుతుందన్నారు.నూతన వైద్యవిధానంలో శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో నొప్పి తక్కువగా ఉంటుందని, ఆపరేషన్ చేయించుకున్నవారు త్వరగా కోలుకోని, రోజువారీ పనులు చేసుకోవడం సాధ్యమౌతుందన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు
స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు 64 మందికి రూ. 45 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు,ఎల్ఓసి లను స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజు 26వ విడతగా సీఎంఆర్ఎఫ్, ఎల్ ఓ సి చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 నెలల్లోనే 879 మంది బాధితులకు 7కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్,ఎల్ఓసి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, నాదేళ్ల వెంకట రమణయ్య, రావుల రవి ఉన్నారు.




అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలపై అధికారులు దష్టి పెట్టాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు కోరారు. పట్టణంలోని విప్పగుంట రోడ్డులో డివిజనల్ అభివద్ధి అధికారి కార్యాలయాన్ని నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగాన్ని అధికారులతో కలిసి ప్రత్యక్షంగా వీక్షించారు.అనంతరం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో కీలక మార్పులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా డివిజనల్ అభివద్ధి అధికారి కార్యాలయాలను ఈరోజు ప్రారంభిస్తున్నారన్నారు. గ్రామాల్లో అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు, అలాగే సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం అనుసంధానంగా పనిచేస్తుందని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు డి.డి.ఓ రాంబాబు,డి.ఎల్.పి.ఓ కష్ణమోహన్, ఇంచార్జి ఏపిడి బాబురావు, కందుకూరు ఎంపీడీవో రత్న జ్యోతితోపాటు వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్లు పంపిణీ


ప్రజాశక్తి - లింగసముద్రం
యుటిఎఫ్ అకడమిక్ విభాగం ద్వారా తయారు చేసిన యు.టి.ఎఫ్ టెస్ట్ పేపర్లను మండలంలోని స్థానిక కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పెద్దపవని లోని భలేరావు పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు కల్లూరి ప్రభాకర్,రామిశెట్టి రంగారావు అందించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యు.టి.ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. యు.టి.ఎఫ్ ప్రచురణల విభాగం ముద్రించిన టెస్టు పేపర్లు 10వ తరగతి విద్యార్థులకు చాలా ఉపయోగంగా ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే వాటిని రూపొందించినట్లు తెలిపారు. లింగసముద్రం హై స్కూల్ విద్యార్థులకు 90 పుస్తకాలను రూ. 7200 వెచ్చించి అందిస్తున్న పూర్వ విద్యార్థి మరియు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు కె.ప్రభాకర్ కి పెద్దపవని విద్యార్థులకు 75 పుస్తకాలను రూ. 6000 వేలు వెచ్చించి అందిస్తున్న పూర్వ విద్యార్థి రామిశెట్టి రంగారావుకి యుటిఎఫ్ లింగసముద్రం మండల శాఖ అభినందనలు తెలియజేసింది.స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమ్మడి శెట్టి మాధవరావు వారిని అభినందించారు. మండల శాఖ బాధ్యులు ఎం. ఎం.సుధాకర్ రావు,టి.సుధాకర్ రావు,యు. రవి బాబు,ఎన్. ఇమామ్, శ్రీనివాసులు, తిరుపతయ్య,గనిపినేని రంగవల్లి,బి .శారద,ఎస్.శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు
డేటా విజ్ఞానం, యంత్ర అధ్యయనం రంగాల్లో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల పేరు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ పొందింది.రాజంపేట అన్నమాచార్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడో అంతర్జాతీయ సదస్సు డేటా విజ్ఞానం, యంత్ర అధ్యయనం ,అనువర్తనాలు రెండు వేల ఇరవై ఐదులో ఈ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రతిష్ఠాత్మక వేదికపై చాటుకున్నారు. కత్రిమ మేధస్సు విభాగం తతీయ సంవత్సరం విద్యార్థినులు మహిత, అమత, అలాగే కంప్యూటర్ శాస్త్రం విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.ఆర్.కె.ఎస్. ప్రసాద్ కలిసి రూపొందించిన పరిశోధన పత్రం సదస్సులో ఆమోదం పొందింది."పరిశోధన ఆల్గోరిథము,సి.ఎం.పీ,పి.ఇ.ఆర్.టి విధానాల ఆధారంగా అత్యల్ప మార్గస్త్ర, ప్రాజెక్టు మెరుగుదలపై తులనాత్మక అధ్యయనం" అనే శీర్షికతో సమర్పించిన ఈ పరిశోధన పత్రం ప్రపంచ స్థాయిలో పేరుపొందిన స్ప్రింగర్ ప్రచురణలలో ముద్రణకు ఎంపికైంది. విద్యార్థులకు పరిశోధన మార్గనిర్దేశం అందించిన పరిశోధన, అభివద్ధి విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు ఈ అధ్యయనం ప్రాజెక్టుల మెరుగుదలలో కీలకమైన శాస్త్రీయ విలువను కలిగి ఉందని పేర్కొన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ చదలవాడ రవి కుమార్ విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.


మహిత


అమృత


గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న రైతులు

కాలువలనిండా గుర్రపు డెక్క..
..పొలాలన్నీ మునక..ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-కోవూరు.:కోవూరు మండలంలో పంట కాలువలు గుర్రపు డెక్కతో నిండిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కాలువల్లో నీరు పారుదల కాక పోవడంతో ఇటీవల వేసిన వరి నాట్లు, వరి నారు మడులు వర్షపు నీటిలో పూర్తిగా మునిగి పోవడం జరిగింది. దీంతో వేలాది రూపాయలు పంట పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కోవూరు చెరువు కింద గల ప్రధాన పంట కాలువల్లో గతేడాది నుంచి కనీసం పూడిక తీయడం లేదని, దీని వల్లనే తమ పొలాల్లో నీరు చేరి మునకకు గురై నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సకాలంలో పంట కాలువల్లో ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత పనులు చేపట్టి ఉంటే తమకు ఈ గతి పట్టి ఉండేది కాదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కోవూరు –పాటూరు రోడ్డులో ఉన్న కలజు వద్ద తూములు చెత్తతో మూసుకొని పోవడం జరిగింది. దీంతో చెరువులోని పొంగి పాటూరు రోడ్డులో ప్రవహిస్తున్నాయి. ఇక్కడ చెరువు కట్ట కింద ఉన్నా పలు గుడిసెల్లోకి కూడా నీరు చేరడంతో నిరుపేద గిరిజనులు బిక్కు బిక్కు మంటూ అక్కడనే ఉన్నారు. వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. నిండుకుండ లా ఉన్నా కోవూరు చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. గతంలో మూడేళ్ల క్రితం వచ్చిన వరదల్లో చెరువుకి ఆరు చోట్ల భారీ గండ్లు పడిపోవడం తో కోవూరు పట్టణం మొత్తం మునిగి పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలుపడ్డ విషయం విధితమే. ఈ సారి అలాంటి ప్రమాదం జరగకుండా జలవనరుల శాఖధికారులు స్పందించి తగిన ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.
గండవరపు బుజ్జయ్య, సిపిఎం మండల కార్యదర్శి

తుపాను వల్ల కోవూరు మండలంలో సుమారు 500 ఎకరాలు వరి నాట్లు, వరి నారు మడులు గత వారం రోజులుగా నీట మునిగి పోవడం వల్ల అవి కుళ్ళి పోవడం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

కాలువ ల్లో పూడిక తీయండి.
షేక్ బాబు, జిల్లా రైతు సంఘ నాయకులు.

పంట కాలువలు నిండా గుర్రపు డెక్క నిండి పోవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగింది. అధికారులు వెంటనే స్పందించి కాలువల్లో పూడిక తీయాలి.

ఎంఎల్ఎ ఆదేశాలతో కంచె ఏర్పాటు..

ప్రజాశక్తి-జలదంకి:ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కావలి కాలువ చిన్న క్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అన్నవరం వద్ద గల ఔట్పాల్ వంతెనపై కంచె ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కావలి పెద్ద చెరువుకు గౌరవరం బ్రాహ్మణక్రాక మేజర్లకు రెండవ కారు నీటి విడుదల కోసం ఇటీవల ఎమ్మెల్యే ఇక్కడికి విచ్చేశారు. ఈ వంతెన మీద ఏర్పాటై ఉన్న ఇనుప కంచె గత కొన్నేళ్ల క్రితం తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. ఎస్సీ కాలనీ తో పాటు ప్రధాన గ్రామానికి చెందిన పశువులు మేకల గొర్రెలు చెరువులోకి మేతకు ఈ వంతెన పై వెళ్తాయి. పశువులు ఈ మార్గంలో పోయేటప్పుడు వచ్చేటప్పుడు ప్రమాద వల్ల కాలువలో పడి తీవ్ర గాయాల పాలవుతున్నాయి. ఈ పరిణామాలు పశువులు మేకల గొర్రెల కాపరులకు వ్యయప్రయాసాలకు గురిచేస్తుంది. దీంతో టిడిపి మండల కో కన్వీనర్ వేల్పుల వేణుగోపాల్, ధనుంజయ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సొంత నిధులు వెచ్చించి వంతెన పై ఇనుపకంచెను ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

తాత్కాలిక డివిజనల్ అభివృద్ధి కార్యాలయం

ప్రజాశక్తి-కావలి.:పరిపాలన సౌలభ్యం కోసం కావలిలో తాత్కాలిక డివిజనల్ అభివృద్ధి కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.పది మండలాల అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఈ కార్యాలయం ద్వారానే జరుగుతుందని తెలిపారు.కావలిలో డి డి ఓ నూతన



కార్యాలయ భవన నిర్మాణా నికి రూ.2.50 కోట్లుమంజూ రైందని, అందుకు ప్రత్యేకంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.కావలిలో పరిపాలన సౌలభ్యం కోసమే తాత్కాలిక డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కావ్య కష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణం 30వ వార్డులోని మున్సిపల్ కార్యాలయం పక్కన గురువారం డిఎల్డిఓ (డివిజనల్ లెవెల్ డవలప్మెంట్ ఆఫీస్) కార్యాలయాన్ని అధి కారులు, పార్టీ నాయకుల తో కలిసి ఎమ్మెల్యే కావ్య కష్ణారెడ్డి రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించారు...(ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు, నిధులను వేగంగా మంజూరు చేయడానికి ఈకొత్తడివిజనల్ అభివృద్ధి కార్యాలయాల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి ఆర్డిఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్,డి డి ఓ విజయ్ కుమార్,ఎంపీడీఓ శ్రీదేవి, పి. ఆర్. డి.ఈ దాసరి శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు..

కోవూరులో వర్ష బీభత్సం..

ప్రజాశక్తి-కోవూరు:మండలంపై మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు భారీ పంట నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని వేగూరు, పాటూరు గ్రామాల్లో పరిస్థితి మరింత విషమంగా మారింది. పొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో అవి చెరువుల్లా మారిపోయాయి. ముఖ్యంగా కొత్తగా వేసిన వరి నాట్లు రెండురోజులకుపైగా నీటిలో మునిగిపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్న స్థితి కనిపిస్తోంది.దాదాపు 50 ఎకరాల వరి నాట్లు పూర్తిగా నాశనం అయినట్లు అంచనా. ఎరువు, విత్తనం, కూలీ, నీటి లాగింపు ఇలా అన్ని ఖర్చులు చేసిన రైతులు ఒక్కసారిగా కురిసిన వర్షాలతో తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయారు. మరోసారి పునర్విత్తనం చేయడానికి రైతు కొన్ని వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. "ఈ భారం రైతులు ఎలా మోయగలరని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు.పంటచేలలో నిలిచిపోయిన మురుగు నీరు వల్ల నాట్లు కుళ్లిపోవడం ఖాయమే. ఇంకా వాతావరణ శాఖ కూడా మరికొన్ని రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించడం రైతుల్లో భయాందోళన పెంచింది. ఇక మిగిలింది ఆరాటమే. రైతులు ఆర్థికంగా గుండెలవిసే స్థితిలో ఉన్నారని అన్నారు.ప్రభుత్వం వెంటనే ముందుకు రావాలి పంట నష్టాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన సమయం ఇదేననిహెచ్చరించారు.ముంపు నీటిని తొలగించేందుకు డ్రెయినేజీ మార్గాలను శుభ్రం చేయాలి.అవసరమైతే నీటిమోటర్లు ఏర్పాటు చేసి పొలాల్లోని నీటిని బయటకు పంపాలి.పునర్విత్తనానికి అవసరమైన మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.రైతులకు సాంకేతిక సూచనలు తక్షణం అందుబాటులోకి తీసుకురావాలి అని అన్నారు.



బాధిత కుటుంబాలను ఆదుకోవాలి.

ప్రజాశక్తి-ముత్తుకూరు:కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీటిలో చిక్కుకున్న మామిడిపూడి దళితవాడ వరద నీటి నివాస గృహాల బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం గ్రామానికి విచ్చేసిన మండల తహశీల్దార్ స్వప్నతో మాటా ్లడారు. నీట మునిగిన గుడిసెలను తహశీల్దార్కు చూపించారు. ప్రభుత్వం సహాయం చేయాలని తెలియజేశారు. వర్షపు నీటిలో ఉన్న గృహాలను గుర్తించి శాశ్వత ఇళ్ల నిర్మాణం చేసే విధంగా తీసుకోవాలని కోరారు. తప్పనిసరిగా ఆదుకుం టామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.



సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచి గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా డివిజనల్ అభివృద్ధి అధికారి (డిడిఓ) కార్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం చిత్తూరు నుంచి వర్చు వల్గా రాష్ట్రంలోని 77 డిడిఒ కార్యాలయాలను డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ వర్చువల్ గా ప్రారంభించారు. ఆత్మకూరు నుంచి మంత్రి రామ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూరులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డిడిఒ కార్యాలయాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో వర్చువల్ గా మాట్లాడుతూ రాష్ట్ర ంలో గ్రామీణ వ్యవస్థను మెరుగు పరిచేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆమోదం మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అత్యంత వేగవంతంగా


వీడియోకాన్ఫరెన్స్లో మంత్రి ఆనం

సఫలీకృతం చేయడం పట్ల డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిడిఒ కార్యాలయాలకు శాశ్వత భవనాలు ఏర్పాటుచేసేలా, ఒకే తరహా డిజైన్లతో భవనాలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం సూచించారు. దీనిపై డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం కు హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ డిడిఒ కార్యాలయాల ఏర్పాటుతో దశాబ్దాలుగా ఎటువంటి మార్పులు లేని పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ట వంతమై ప్రజలకు ప్రభుత్వ సేవలు మ రింత సులభతరం అవుతాయని చెప్పారు. గ్రామాల్లో రహదారులు, తాగు నీరు, వైద్యం, విద్యారంగం పరంగా మొదలైన కనీస వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతమవు తాయన్నారు. మండలాల సమస్యలకు డి డిఒ కార్యాలయం పరిష్కార వేదిక కానుందన్నారు.డిడిఒ కార్యాలయాల ఏర్పాటుతో ఎప్పటి నుంచో ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు లభించడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఆత్మకూరులో తాత్కాలికంగా ప్రభుత్వ భవనంలో డి డి ఓ కార్యాలయాన్ని 11 లక్షలు వ్యయంతో ఫర్నిచర్, ఇతర సామగ్రి సమకూర్చి ఏర్పాటు చేశామని, త్వరలోనే సొంత భవనం నిర్మించేందుకు కషి చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో 50 కోట్ల 48 లక్షలతో 719 పనులు మంజూరు కాగా, కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ఉపాధి హామీ నిధులతో 562 సిమెంట్ రోడ్లకు 34 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఇతర నిధుల ద్వారా 9 కోట్లతో 156 పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ప్రతి మండలానికి కూడా అదనంగా మరో మూడు కోట్లను రహదారుల నిర్మాణానికి మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరామని, అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. 27 కోట్లతో గ్రామాలను అనుసంధానం చేస్తూ ఏడు తారు రోడ్లు మంజూరైనట్లు మంత్రి చెప్పారు. వీర్ల గుడిపాడు గ్రామానికి రాకపోకలు కల్పించేందుకు బీరా పేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 25 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన గ్రామీణ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి, ప్రజలకు ప్రభుత్వ పరిపాలన మరింత సౌలభ్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణయ్య, రెవెన్యూ డివిజన్ అధికారి పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట: పాత బిట్రగుంటకు చెందిన ఎస్విపిఎం కెనాల్ 2 అధ్యక్షులు యన్నా బత్తిన రమణయ్య బోగోలు మండలం విశ్వనాథరావుపేట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు దాదాపు ఐదువేల రూపాయలు విలువచేసే కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్ మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయుల కోసం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎస్విపిఎం, కెనాల్ ట2 అధ్యక్షులు ఎన్నా బత్తిన రమణయ్య మంచి మనసుతో కుర్చీలను గురువారం ఉపాధ్యాయులకు అందజేశారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :ఎపిఎన్ జిఒ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా యూనిట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ఉదయం 10.30 గంటల నుండి ఆత్మకూరు పట్టణంలోనికార్యాలయ ప్రాంగణం లో జరిగింది.. ఈ సందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఎవి కృష్ణ కుమార్ నెల్లూరు జిల్లా జాయింట్ సెక్రటరీ సహాయ ఎన్నికల అధికారి. రామకృష్ణా రెడ్డి, నెల్లూరు సిటీ అధ్యక్షులు,ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా పెంచలయ్య, నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకటించారు. ఈ ఎన్నికలలో ఆత్మకూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు బి. శైలజసహాధ్యక్షులు ముజీబ్ అహ్మద్, ఉపాధ్యక్షులు(3 పోస్టులు)1 భాస్కర్ రెడ్డి,2. రఘు రామ్,3.ఉత్తయ్య ,కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సంయుక్త కార్యదర్శులు (3 పోస్టులు) ప్రతాప్ కుమార్, కె నిరంజన్ షఫీ, సంయుక్త కార్యదర్శి హైమవతి,కోశాధికారి సుప్రియ వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.నూతనంగా ఎన్నికైన ఆత్మకూరు తాలూకా యూనిట్ కార్యవర్గ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు పల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంచార్జి అధ్యక్షులు నంది మండలం ఆంజనేయ వర్మ , జిల్లా కార్యదర్శి గాది రాజు రామకష్ణ ఎన్నికైన కార్య వర్గ సభ్యులకు శుభాకాంక్షలు అభినందించారు. మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు.స్వర్ణలత, జిల్లా జేఏసీ చైర్మన్ చిన్నమ్మ, వైస్ ప్రెసిడెంట్ కరుణమ్మ, జిల్లా కన్వీనర్ నవోదయ మహిళ విభాగం నూతన కార్యవర్గం మహిళా విభాగాన్ని ఎన్నుకోవడం జరిగింది వారందరికీ అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఆత్మకూరు యూనిట్ అధ్యక్ష కార్యదర్శిలు ఘనంగా పూల మాల శాలువాతో సత్కరించారు.



పేదల సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఇల్లు మంజూరైన పేద మధ్యతరగతి కుటుంబాలు ఎన్డీఏ ప్రభుత్వం కల్పించిన గొప్ప అవకాశాన్ని సొంతింటి కల నెరవేర్చుకోవాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.6.27 కోట్ల సబ్సిడీతో 251 ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణ పరిధిలో ఎన్టీఆర్ భరోసా హౌసింగ్ స్కీమ్ కింద కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఒక్కరికీ ఇల్లు అనేటటువంటి ఒక ఆలోచనతో గతంలో ఇచ్చినటువంటి వాగ్దానం మేరకు ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకొని నిధులు మంజూరు చేయడానికి ఇవాళ విడుదల చేస్తున్నామన్నారు. పట్టణంలో ఇప్పటికీ ఇల్లు కావాలని వచ్చినటువంటి సర్వే రిపోర్ట్ ప్రకారం దాదాపుగా 281 మందికి రూ.6 కోట్ల 27 లక్షలు విలువ చేసే ఇళ్లు మంజూరు చేస్తూ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పుడు 251 మందికి వాళ్లకు ఆర్డర్స్ రెడీగా ఉన్నాయని, వచ్చిన వాళ్లకు ఇవ్వడం జరుగుతుందని, రాని వాళ్లకు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రకారం చూస్తే ఆత్మకూరులో 578 మందికి సొంత స్థలాలు ఉన్నాయని ఇల్లు కట్టుకుంటామని అడిగారు. అందరికీ ఇల్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల బైండోవర్

ప్రజాశక్తి-ముత్తుకూరు:నేలటూరు పాలెం లో పట్టుబడిన 13 మంది పేకాట రాయుళ్లను గురువారం కృష్ణపట్నం పోలీస్ స్టేషన్ పోలీసులు తహశీల్దార్ స్వప్న ఎదుట బైండోవర్ చేశారు. జూదం ఆడిన వీరందరినీ తహశీల్దార్ మందలిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పునారావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30 యాక్ట్ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కావలి:
రాష్ట్ర ప్రభుత్వం బీపీసీఎల్ కంపెనీకి భూములను కట్ట బెట్టేందుకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగాన్ని మొహరిం చాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లా డుతూ, పోలీసులు కావలి మండలం లోని చెన్నాయ పాలెం, రుద్రకోట, గుమ్మడి బొందల,మత్స్యకా రుల పాలెంలలో బయోత్పాత వాతావరణ పరిస్థితులు సృష్టిస్తున్నార న్నారు.ఓవైపు మైక్ ప్రచారాలు, పోలీసు సహారాలు చేస్తున్నారన్నారు ఈరోజు ్రైతులు,వ్యవసాయ కార్మికులువారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు చెన్నాయపాలెం గ్రామానికి పోయి విచారించారన్నారు. ఈ సందర్భంగా తాళ్లూరు మాల్యాద్రిని పోలీసులు ఆ గ్రామంలో ఆంక్షలు ఉన్నవని 30 యాక్ట్ అమలులో ఉన్న దని,మీరు గ్రామస్తులతో మాట్లాడొద్దని, రూరల్ ఎస్సై బాజీరావు,మాల్యాద్రిని గ్రామం నుండి బయటకు పంపించారని తెలిపారు. ఇది రాజ్యాంగ హక్కులను ప్రాథమిక హక్కులను పోలీసువారు హరిస్తున్నారని ఆరోపించారు.రెవెన్యూ,పోలీసు యంత్రాంగము, రైతులకు వ్యవసాయ కార్మికులకు అండగాఉండాల్సింది పోని చ్చి, బీపీసీఎల్ కంపెనీకి దళారీ తనం వహిస్తూ, వారి భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపిం చారు. అతి తక్కువ రేట్లకు పొలాలనుకొని, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇలా హక్కులను కాలరాస్తున్నారని,టీ మాల్యాద్రి,రైతు సంఘం జిల్లాకమిటీ సభ్యులు గడ్డం మాల్యాద్రి, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల వెంకయ్య, మండలకార్యదర్శి ఎం రాధాకృష్ణయ్య, లు ఒక పత్రికా ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

అభివృద్ధి ప్రణాళిక పై సమావేశం

ప్రజాశక్తి-ముత్తుకూరు :జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ద్వారా జీవనోపాదుల విభాగంలో చిరు వ్యాపారస్తులకు రుణాలు మంజూరు చేసే అంశంపై సూక్ష్మ రుణాల అభివృద్ధి ప్రణాళిక పైన గురువారం సంఘమిత్ర కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఇటీవల శిక్షణ పొందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ తో పాటు విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు హాజరు కావడం జరిగింది. జిల్లా డిపిఎం మధుసూదన్ మాట్లాడారు. జిల్లా స్థాయిలో ముత్తుకూరును పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. 300 మంది చిరు వ్యాపారస్తులకు సూక్ష్మ రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక తయారు చేసింది అన్నారు. ఈ ప్రాజెక్టును సంఘమిత్ర కార్యాలయం సిబ్బంది విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

తలసరి ఆదాయం పై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి :గ్రామ స్థాయిలో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కలిపి చేపట్టడంతో తలసరి ఆదాయం పెంచుకొనే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో బి.ఎస్సి.(హన్స్ వ్యవసాయం) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు గ్రామీణ పని అవగాహనా కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం కింద ప్రత్యేక జాతీయ సేవా శిబిరం జాతీయ సేవ పథక అధికారిణి అధికారులు డా. ఎన్. సునీత, పి. వెంకటేశ్వర్లు స్వచ్ఛంద సేవకులు గండిపాలెం, వెంగళరావు నగర్ గ్రామాలలో పశు వైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర అధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సూపర్ నేపియర్ గడ్డి సమతుల పోషకాలతో పశువుల పోషణకు లాభకరమైన పశుగ్రాసమని పశువులను పరీక్షించి, వాటి ఆరోగ్యం కోసం తగు సూచనలు చేశారు. అనంతరం డా. టి.గోపికృష్ణ, ఏ. వి. ఎస్. దుర్గాప్రసాద్, ఎం. కిషన్ తేజ్, ఎన్. సునీత, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ప్రసంగించారు. కుమారి కార్తికేయ స్వాగత వచనాలతో ప్రారంభమై బి. ఆర్ .మారుతీ ప్రసాద్ వందన సమర్పణతో ముగించారు.



మాట్లాడుతున్న ఆర్ సుందరరరావు

విట్స్లో రహదారి భద్రత పై సదస్సు

ప్రజాశక్తి- కావలి: స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణ లో కళాశాల ప్రొఫెసర్ ఆర్.ఎస్. ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో రహదారి భద్రత,అవగాహన పై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మోటారు వాహనాల ఇన్స్పెక్టర్ ఆర్. సుందర్ రావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు రహదారి భద్రతకు సంబంధిం చిన రూల్స్ అన్నింటి పైన అవగాహన కలిగి ఉండాల న్నారు. ఏవిధమైన పొరపాట్లకు తావు ఇవ్వక,ప్రమాదాల భారీ నుండి, తమను తాము కాపాడుకుంటూ ఇతరులకు కూడా ఇబ్బందులు కలుగజేయకూడదని ఉద్బోధిం చారు.ఈ సదస్సు కు విశిష్ట అతిథిగా పాల్గొన్న కావలి అసిస్టెంట్ మోటారు వాహనాల ఇన్స్పెక్టర్ లక్ష్మీబాయి మాట్లాడుతూ వాహనాన్ని నడుపు వారు విధిగా హెల్మెట్ ను, సీటు బెల్టును ఉపయోగిం చాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డి. విద్యాధర కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్.డి ప్రత్యూషా రెడ్డి, అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లిఖిత్ రెడ్డి విద్యార్థులను నిర్వాహకుల ను అభినందించారు.



'దిత్వా' తో స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి-ఎఎస్పేట:మండలంలోని కొండమీద కొండూరు గ్రామానికి వెళ్లే మధ్యలో గల బ్రిడ్జిపై దిత్వ తుపాను ప్రభావంతో, భారీగా నీరు ప్రవహి స్తున్నందున ఆ ఊరి గ్రామస్తులను రాకపోకలు కొనసాగించకుండా, పూర్తిగా నిలిపివేయడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి పి. ప్రసన్న కుమారి పత్రికా ముఖంగా తెలియజేశారు. అదేవిధంగా రాత్రిపూట ఎవరు ఆ దారిన పోకుండా తగు ఏర్పాట్లు చేయడం చేయడం జరిగిందని, గ్రామంలో దండోరా కూడా వేయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఏ సైదులు, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

మేయర్ను ఇబ్బందులకు గురి చేయొద్దు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:అవిశ్వాస తీర్మానం సాకుతో మేయర్ ను ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గ మని, సామాజిక తత్వవేత్త యనమల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవిశ్వాసం పేరుతో తొలగించే చర్యను ఖండిస్తున్నా మన్నారు. గిరిజన మహిళను అనేక విధాలుగా ఇబ్బం దులకు గురి చేస్తుండడం సరికాదని అభిప్రా యం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా మేయర్ పదవిలో ఆమెను కొనసాగించాలని కోరారు. ఆమె పట్ల వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. పరిపాలన పట్ల నగర, రూరల్ ఎమ్మెల్యేలు చెప్పినట్లు మేయర్ వినక పోవడమే చేత, అవిశ్వాస తీర్మానం పెట్టారని తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇదెక్కడ న్యాయమని ప్రశ్నించారు. మేయర్ పదవిలో ఆమెను యథాతథంగా కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.



బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-విడవలూరు
:ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నా పేదవాడి ఆరోగ్యానికి ఏ లోటు రానీయకుండా అనారోగ్య బాధితులను ఆదుకుంటున్న సిఎం చంద్రబాబు నాయుడుకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ధన్యవాదాలు తెలియజేశారు. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్ లోని ఆమె నివాసంలో 20 వ విడతగా కోవూరు నియోజకర్గానికి చెందిన 45 మందికి 37 లక్షల రూపాయలు, నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో మరో 11 మందికి దాదాపు 9 లక్షల విలువైన చెక్కులను బాధితులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సి ఎం ఆర్ ఎఫ్ ద్వారా సిఎం చంద్రబాబు నాయుడు లక్షలాది మంది అనారోగ్య బాధి తులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారని కొని యాడారు. కార్యక్రమంలో కొడవలూరు, విడవలూరు, కోవూరు, ఇందుకూరు పేట, బుచ్చిరెడ్డి పాళెం మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏటూరి శ్రీహరి రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: దిత్వా తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆత్మకూరు చెరువు నిండిపోవడంతో అధికారులు చెరువు వద్ద గస్తీ నిర్వహించారు. చెరువు పూర్తిగా నిండడంతో భారీగా అలుగులు పారుతుండడంతో సమీప హాస్టల్ విద్యార్థులు, పట్టణ ప్రజలు నీటి ప్రవాహంలో దిగే అవకాశం ఉండడంవల్ల ముందస్తు చర్యల్లో అలుగు వద్ద ఎవరూ రాకుండా రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు వీఆర్ఓలను భద్రతగా ఏర్పాటు చేశారు. పట్టణ వీఆర్ఓలు ప్రతాప్, చిన్నయ్య లు చెరువు వద్దనుండి నీటి ప్రవాహం రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వారానికే కూలిన ట్రాన్స్ఫార్మర్..

ప్రజాశక్తి-నెల్లూరు :నెల్లూరు రూరల్ మండలంలోని వెల్లంటి గ్రామంలో ప్రారంభించిన వారం రోజులకే ట్రాన్స్ఫార్మర్ కూలింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందు తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ఆర్డిఎస్ ఎస్ స్కీమ్ కింద ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్రమంలో గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే ట్రాన్స్ఫార్మర్ కూలడం దారుణమని విస్మయం వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు త్వరితగతిన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.




సన్మానిస్తున్న దృశ్యం

మంత్రి ఆనంకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి:మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిను తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి శాలువా పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మన్నేటి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలం లో 1 నుంచి 14 బూతుల పరిశీలకుల గా తెలుగుదేశం పార్టీ ని మరింత బలోపేతం చేయటానికి ఏర్పాటు చేసిన కమిటీ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి నన్ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కమిటీ నియమించటం జరిగిందని అందులో భాగంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం సన్మానం చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కమిటీ లో మండల అధ్యక్షులు ,మండల కమిటీ , క్లస్టర్స్ ఇంచార్జి లు బూత్ ఇన్చార్జీలు,పంచాయతీ కమిటీ లు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలిపారన్నారు.

ఎస్ఐఆర్. పై ఆర్డిఒ సమీక్ష

ప్రజాశక్తి-కావలి:కావలి ఆర్ డిఒ ఎం. సన్నీ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో, స్థానిక ఆర్.డి.ఓ. కార్యాలయంలో గురువారం ఎస్.ఐ.ఆర్.(స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్) మాపింగ్ కార్యక్రమం పై కావలి అర్బన్ ఏ ఈ ఆర్ ఓ, సూపం ్వైజర్లు, బి.ఎల్.ఓలతో రివ్యూ మీటింగ్ నిర్వహి ంచారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్, అర్బన్ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

6న జిల్లాస్థాయి యూనిటి మార్చ్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జిల్లా స్థాయి యూనిటి మార్చ్ కార్యక్రమాన్ని ఈ నెల 6వ తేదిన ఆత్మకూరులో నిర్వహిస్తున్నట్లు ఆర్డిఒ భూమిరెడ్డి పావని తెలిపారు. ఈ మేరకు గురువారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 6వ ది ఉదయం 9 గంటలకు జిల్లా ప్రభుత్ వైద్యశాల నుండి రవిజేత కళ్యాణ మండపం వరకు 500 మంది యువతతో ఈ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్ల, ఎస్పి అజితావెజెండ్ల హాజరవుతారన్నారు. యూనిటి మార్చ్ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా మేరా యువ భారత్ జిల్లా అధికారి ఏ మహేంద్రరెడ్డి, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేరు మార్పు ప్రకటన

జి.రమాదేవి, భర్త బండి రామమోహన్ చౌదరి అను నా యొక్క కుమారుడి పేరు **దీపాన్ష బండి** పేరును **దీపాన్ష్ విహారి బండి** గా మార్చుకోవడం జరిగింది. ఇకపై నా యొక్క కుమారుడి పేరు **దీపాన్ష్ విహారి బండి** గా పరిగణించబడును.

ఇట్లు.
జి. రమాదేవి, భర్త బండి రామమోహన్ చౌదరి,
చినపవని గ్రామం, లింగసముద్రం (మం)
ఎస్పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

మహారాజశ్రీ నెల్లూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No.168 / 2025
పోతల సుధాకర్ రెడ్డి - అప్పీలెంటు
Vs
1. గోపవరం వెంకట లక్ష్మి
2. కర్రి వెంకట రామకృష్ణా రెడ్డి - రెస్పాండెంట్స్ టు,
ఆర్2. కర్రి వెంకట రామకృష్ణారెడ్డి,
తండ్రి **విష్ణు రెడ్డి,** కాపుల పేట, మూల ఉప్పరగూడెం, పెద్దలంక, కృష్ణా జిల్లా.

పై అప్పీలెంటు మీపై దాఖలు చేసిన అప్పీలు మీ నోటీసు నిమిత్తం **తే07-01-2026ది** న పై కోర్టు వారు వాయిదా వేసియున్నారు. యిందు విషయమై ఆక్షేపణలు ఉన్న 2026 సంవత్సరం జనవరం 7వ తేది పగలు **10.30 గంటలకు** స్వతహాగా గానీ, సంపూర్ణముగా, సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరు ద్వారా గానీ పై కోర్టులో హాజరై కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు అని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 07-01-2026

ఇట్లు
బత్తిన రామక్రిష్ణా రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
అడ్వకేట్, నెల్లూరు,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.